పోటాపోటీగా ఇరు పార్టీల ప్రచారం

పోచారం: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోచారం మున్సిపాలిటీలో పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇరు పార్టీలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్ ప్రాంతాల్లో ఇంటింటికీ బీఆర్‌ఎస్ పేరుతో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కర్నాటకలో కాంగ్రెస్ వైఫల్యం చెందిందని, తెలంగాణలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇస్మాయిల్‌ఖాన్‌గూడ నుంచి అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు.

జోరుగా ఎన్నికల ప్రచారాలు



మేడ్చల్: ఎన్నికల తేదీ దగ్గర పడుతుండటంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల అభ్యర్థుల గెలుపు కోసం ఆ పార్టీల నాయకులు ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో నాయకులు హంగు ఆర్భాటాలతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తూ ఓటు వేయాలని కోరుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం సాగిస్తున్నారు.

మంత్రి మల్లారెడ్డిని గెలిపించాలి



కొర్రెములలో ప్రచారం చేస్తున్న దుర్గరాజ్, వెంకటేశ్‌గౌడ్, రాజుముదిరాజ్

ఘట్‌కేసర్: కొర్రెముల గ్రామంలో వార్డు సభ్యుడు దుర్గరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి చామకూర మల్లారెడ్డి విజయానికి కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి అభివృద్ధి పనులు, సీఎం కేసీఆర్ సర్కారు పేదలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రచారంలో సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆనంద్, ఆంజనేయులు, యాదగిరి, ఉద్యమకారుడు మహేంద్రచారి, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు నేతల ప్రచారం



నాగారం మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం

కీసర: బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మంత్రి మల్లారెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే మరోసారి మల్లారెడ్డిని గెలిపిస్తాయని నాగారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కొకుట్ల రాహుల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన బీఆర్‌ఎస్ యువజన నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలంతా మల్లారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి దిక్కులేదు



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, భద్రారెడ్డి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీకి దిక్కులేదని, కాంగ్రెస్ నుంచి వచ్చిన వారే వెళ్లిపోయారు తప్ప నాయకులందరూ బీఆర్‌ఎస్‌లో ఉన్నారని ఆ పార్టీ బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మున్సిపల్ సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ జ్ఞానం లేని మాటలు మాట్లాడటం మానుకోవాలని, ఆయన సర్పంచ్‌గా ఉన్నప్పుడు అభివృద్ధి కుంటుపడిందన్నారు. వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంగతి తెలుసని, మాకు, కార్యకర్తలకు చేసిందేమీ లేదని అన్నారు. మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, ఓటు అడిగే హక్కు మాకే ఉందన్నారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనురాధా, రమాదేవి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, జహంగీర్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, మల్లికార్జున్‌రాజ్ పాల్గొన్నారు.

వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం



చౌదరిగూడలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న, ఆంజనేయులుగౌడ్, భోజిరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్‌ను గెలిపించాలని ఆ గ్రామశాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలు ఇంటింటికీ ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం చేయిగుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో భోజిరెడ్డి, నాగేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వినోద్‌కుమార్, నర్సింగ్‌రావు, దావిద్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నాపురంలో రూ.2.19 లక్షల పట్టివేత

జవహర్‌నగర్: ఎన్నికల నియమావళిలో భాగంగా జవహర్‌నగర్ పోలీసులు శుక్రవారం చెన్నాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఓమర్ షరీఫ్, నాగులు రూ.2.19 లక్షలు ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. నగదుకు ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు.

చిత్తం..నాయకా..!

- నాయకుల సేవలో ఆర్‌పీలు
- మహిళలను జమ చేస్తున్న వైనం
- అధికార పార్టీ కోసం సమావేశాలు
- రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి..
- రూ.వెయ్యి, రూ.2 వేల చొప్పున చెల్లింపు
- వారికి మాత్రం ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్
- అధికారులు హెచ్చరించినా నిర్లక్ష్యం



మేడ్చల్: మహిళల్లో చైతన్యం నింపి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఏర్పడిన మహిళా సంఘాలకు ఈ ఎన్నికల్లో ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నో ఏళ్లుగా గ్రామాలు, కాలనీల్లో పొదుపు సంఘాలు నడుస్తున్నాయి. పది మంది మహిళలతో ఒక గ్రూపు ఏర్పాటు చేస్తే ఆ గ్రూపునకు అధ్యక్షురాలు ఉంటారు. కొన్ని గ్రూపులకు కలిపి ఆర్‌పీ(రీసోర్స్ పర్సన్) బుక్ కీపర్లు, ఉంటారు. వారిపై సీసీ(కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు), ఏపీఎం, మున్సిపల్ కమిషనర్ ఇలా వారిపై అందరూ ఉంటారు.

- మేడ్చల్ మండలంలో దాదాపుగా 700 మహిళా సంఘాలు, మున్సిపాలిటీలో 750 సంఘాలు, గుండ్లపోచంపల్లిలో 300 సంఘాలు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో సగటున 10 నుంచి 12 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. దాదాపు మొత్తం 17 వేల మంది మహిళలు మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరందరూ మేడ్చల్ నియోజకవర్గ ఓటర్లే.. మహిళా సంఘాల్లో అధికంగా గ్రామాలు, మున్సిపల్ వార్డులలో నివాసముండే వారు అధికంగా ఉంటారు. సంఘాలకు వచ్చే రుణాలు తీసుకోవడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అన్ని పనులు చూస్తూ పట్టు సాధిస్తున్నారు. వారు నివాసముండే ప్రాంతాల్లో పూర్తిస్థాయి పట్టు ఉండటం, ఏ ఇంట్లో ఎవరు ఉంటారో వారికి తెలిసి ఉండటం కలిసివస్తోంది.

వారికోసమే నాయకుల వల..

ఏ ఇంట్లో ఎవరు ఉంటారు..? వారి ఆర్థిక అవసరాలు, వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులు అన్నీ తెలుసు కాబట్టి వారి ద్వారా ప్రచారం నిర్వహించి ఓట్లు రాబట్టుకోవాలని నాయకుల ఎత్తుగడ ప్రతి ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. సహజంగా సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, చైర్మన్లు అధికార పార్టీ వారే ఉండటంతో వారు తమ అభ్యర్థి గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాలు, వార్డులవారిగా ఆర్‌పీలు, సీసీల ద్వారా నేతలు సమావేశాలు ఏర్పాటు చేయించి వారికి కావాల్సిన తాయిలాలు అందజేసి ఓటు కోసం ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా అధికార పార్టీల నేతలు ఇలాంటి రాజకీయం అధికంగా చేస్తున్నారు. రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసి తమ పార్టీల అభ్యర్థులు, కుటుంబ సభ్యులను సమావేశాలకు పిలిపించి ఒక్కొక్కరికి రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు, సమావేశాలు ఏర్పాటు చేయించిన ఆర్‌పీలకు, గ్రూపు లీడర్లకు, సీసీలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తున్నారు. ఇలా ఏ దారి దొరికితే ఆ దారిలో ప్రచారం చేస్తూ గెలుపు కోసం నాయకులు ప్రయాసలు పడుతున్నారు.

ముమ్మాటికీ విధుల దుర్వినియోగం..

ఆర్‌పీలు, సీసీలు ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా నెల జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులే.. ఎన్నికలలో ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్న వారు పని చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ వారు ఏమీ పట్టించుకోవడం లేదు. నాయకుల వలలో పడి వారు చూపే ఆశలకు ఆకర్షితులై తమ విధులను దుర్వినియోగం చేస్తున్నారు. ఎన్నికల్లో నిష్పక్షపాతంగా ఉంటూ ఎన్నికల నియమావళిని పాటించాల్సిన ఉద్యోగులే ఒక పార్టీ కోసం పనిచేయడం ముమ్మాటికీ విధుల దుర్వినియోగం. ఆర్‌పీలు, సీసీలు, గ్రూపు లీడర్లను అధికారులు ముందుగానే హెచ్చరించినా వారు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తూ నాయకుల సేవలో మునిగి తేలుతున్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా శనివారం రావల్‌కోల్ సబ్ స్టేషన్ పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో పరిశ్రమలకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ పవన్ చందు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మేడ్చల్ జిల్లా బాస్కెట్ బాల్ ఎంపికలు

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా బాస్కెట్ బాల్ అండర్–14, అండర్–17 బాలబాలికల ఎంపిక కండ్లకోయ సూర్య వికాస్ ఎదురుగా సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్‌లో ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వాహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే బాల బాలికలు సోమవారం ఉదయం 8.30 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్రీడాకారులు అర్హత ఫామ్‌లో ఫొటోతో పాటు బోనాఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, సర్టిఫికెట్లపై హెచ్‌ఎం సంతకం, స్టాంప్ తప్పనిసరి ఉండాలని సూచించారు. ఫోన్: 9000654706, 8374461481.

బీజేపీకి శివయాదవ్ రాజీనామా

బోడుప్పల్: బోడుప్పల్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు మాదుగుల శివయాదవ్ శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. బోడుప్పల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులకు తన రాజీనామా పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. త్వరలో తన అనుచరులతో పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం మేడిపల్లిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, మహేష్ గౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌గౌడ్, వంగేటి ప్రభాకర్ రెడ్డి, వేముల మహేష్‌గౌడ్, ఎండీ మజార్, రామ్‌రెడ్డి, నాగేష్, ముదిగొండ రమేష్, రంజిత్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఆకుతోట గీతారెడ్డి

బోడుప్పల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి అన్నారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డితో కలిసి ఆమె డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఏదో ఒక సంక్షేమ పథకం పొందిన వారే ఉన్నారన్నారు. వారందరూ మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నారన్నారు. మహిళలకు కూడా కొన్ని బాధ్యతలు అప్పగించి వారి సేవలను పార్టీ కోసం వినియోగించుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు నడుం బిగిదాం

మల్లాపూర్: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బెల్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మల్లాపూర్ పారిశ్రామికవాడలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(నవరత్న డిఫెన్స్ ప్రభుత్వం రంగ సంస్థ) ఆధ్వర్యంలో నిఘా జాగృతి వారోత్సవాల సందర్భంగా అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దాదాపు 3 కిలో మీటర్లు ర్యాలీ తీశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన ప్రజలందరి కృషితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ రుతు బెకమ్, బెల్ సంస్థల అధికారులు, కార్మికులు 300 మంది పాల్గొన్నారు.

తొలిరోజు.. ఒకే ఒక్కరు

మల్కాజిగిరి: తొలి రోజు మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి ఒకే ఒక్కరు నామినేషన్ దాఖలు చేశారు. అల్వాల్‌కు చెందిన జాజుల భాస్కర్ శ్రమజీవి పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. భాస్కర్ గతంలో పలుమార్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం నామినేషన్ దాఖలు చేశారు. 2009 ఎన్నికల్లో 157 ఓట్లు, 2018 ఎన్నికల్లో 513 ఓట్లు పొందారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద బందోబస్తును డీసీపీ జానకి పరిశీలించారు.

బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి

మేడ్చల్: వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. 23వ వార్డు, 8వ వార్డు(గిర్మాపూర్), బండమాదారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో చేరారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు దయానంద్ యాదవ్, నర్సింహారెడ్డి, రాజమల్లారెడ్డి, రామస్వామి, కొడే మహేష్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేకంగా ప్రార్థనలు

మేడ్చల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి మల్లారెడ్డి మేడ్చల్‌లో దర్గాలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. పట్టణంలోని వివిధ మజీద్‌లలో ముస్లిం మత పెద్దలతో రహస్యంగా సమావేశమై ప్రార్థన సమయంలో పట్టణంలోని జిందాషావలి దర్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమాలలో నాయకులు లాయక్ అలీ, మహబూబ్ అలీ, నర్సింహారెడ్డి, శేఖర్‌గౌడ్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవం

కీసర: కీసరలో బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపతో గ్రామంలోని ప్రజలంతా సంతోషంగా ఉండాలని అభిలాషించారు. మరో పక్క వేదపండితులు వెంపటి ప్రభాకర్‌శర్మ, సాయికిరణ్‌శర్మ, సందీప్ శర్మల ఆధ్వర్యంలో గురువందనం, ప్రారంభ ఆవాహిత దేవత, నిత్యపూజ, చండీహోమం, రుద్రహోమం, మూలమంత్ర హోమం, మహాస్నపనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బలిదే రమేష్‌గుప్తా, ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

ప్రతి ఉద్యోగి అవినీతికి దూరంగా ఉండాలి



నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం

కీసర: భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం ఆధ్వర్యంలో నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో అవినీతి నిర్మూలన వారోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ ఇన్‌చార్జి హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన విధి నిర్వహణలో అవినీతికి పాల్పడకుండా తన సేవలను ప్రజలకు అందించాలని కోరారు. ప్రతి ఉద్యోగి అవినీతికి దూరంగా ఉంటూ అవినీతి రహిత భారత దేశాన్ని తయారు చేసేందుకు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ ఇంజినీర్ కే.జ్ఞానేశ్వర్, జి.డి.రాజు, బీవీ మురళి మనోహర్, రవీందర్, పురపాలక సంఘ కార్యాలయం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తూంకుంటలో కాంగ్రెస్ గడపగడప ప్రచారం



పోతాయిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలో శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరించారు. పేదల కష్టాలు పోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వజ్రేష్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ హరివర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలేష్, పలు అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దాం



గడప గడప ప్రచారంలో పోగుల నర్సింహారెడ్డి

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దామని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. 15వ డివిజన్ సూరజ్‌నగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన గడప గడప కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్, కుర్రి శివశంకర్, నాయకులు హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 4 నుంచి శిక్షణ

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికలకు సంబంధించి మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలోని పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు ఈ నెల 4, 5 తేదీల్లో ఎన్నికల శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల శిక్షణకు అందరూ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. ఈ నెల 4, 5వ తేదీల్లో జరిగే ఎన్నికల శిక్షణలో 2,877మంది పీవోలు, 2,877మంది ఏపీవోలకు, 5,754మంది ఓపీఓలు, 520మంది మైక్రో పరిశీలకులు పాల్గొంటారని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ ఆఫీసర్లు, డీఎల్‌ఎంటీలు, ఏఎల్‌ఎంటీలు, సెక్టోరియల్ ఆఫీసర్ల ద్వారా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని అధికారులకు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో, మేడ్చల్ నియోజకవర్గం అధికారులకు బోగారంలోని హోలిమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధికారులకు అల్వాల్లోని లయోలా కాలేజీలో, మల్కాజిగిరి నియోజకవర్గం అధికారులకు సైనిక్‌పురిలోని భవంత్ కాలేజీలో, ఉప్పల్ నియోజకవర్గం అధికారులకు రామంతాపూర్లోని జవహర్లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీలో శిక్షణ ఉంటుందన్నారు. వీరికి నోడల్ అధికారులు దేవసహాయం, శేకూరామ్ శిక్షణ ఇస్తారని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి పీవోలు, ఏపీవోలు అందరూ తప్పకుండా హాజరు కావాలని, లేనట్లయితే ఆర్పీఏ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాల్లోని ఐదు శాసనసభ నియోజకవర్గాలకు అబ్జర్వర్లు, వ్యయపరిశీలకులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రత్యేకంగా వారిని నియమించిన పరిశీలకులు అన్నీ విషయాలను క్షుణంగా పరిశీలిస్తారన్నారు. నియోజకవర్గాల వారీగా నియమితులైన పరిశీలకుల పూర్తి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

అసెంబ్లీ నియోజకవర్గం	అబ్జర్వర్ పేరు
మేడ్చల్	ఎస్.కె.జైన్
మల్కాజిగిరి, ఉప్పల్	పూర్వా గార్గ్
కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి	అమన్మిట్టల్

అసెంబ్లీ నియోజకవర్గం	వ్యయ పరిశీలకులు
మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్	ప్రేమ్‌ప్రకాశ్ మీనా
కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి	వాఘ్ బాలాసాహెబ్ బాపూరావు


ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ) డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి, మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ పేరుతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని, ఇంజినీరింగ్ దశలోనే పరిశ్రమలకు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని వివరించారు. విద్యా సంస్థలకు పరిశ్రమలకు వారధిగా ఈఎస్‌సీఐతో ఒప్పందం వారధిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, ఎఫ్‌డీపీ సెల్ హెడ్ సాయికిషోర్, ఐఐసీ హెడ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో డ్రగ్స్ పట్టివేత



జవహర్‌నగర్: వాహనాల తనిఖీలు చేస్తుండగా అక్రమంగా డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన కుమావత్ చిల్లారాం, మోహన్‌లాల్ చౌదరిలు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగించేవారు. ఈజీ మనీకి అలవాటు పడి రాజస్థాన్ నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ తీసుకువచ్చి తెలంగాణలో అధిక ధరకు అమ్ముతుండేవారు. శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వారు పట్టుబడ్డారు. 50 గ్రాముల ఓపీఎం డ్రగ్స్, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు.